నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
ఆదివారం 19 మార్చి 2023

ప్రశ్నాపత్రాల లీకేజీ ప్రభుత్వ వైఫల్యమే

నవతెలంగాణ-కాగజ్‌నగర్

టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజీకి ప్రభుత్వ వైఫల్యమే కారణమని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 2016లో సింగరేణి జూనియర్ అసిస్టెంట్ ప్రశ్నాపత్రం లీకేజీ, 2019లో ఎంసెట్ ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు ఇంటర్ మార్కుల అవకవతవకలు తదితర కారణాల వల్ల 25 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. ప్రస్తుతం టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ కారణంగా 30 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అయోమయంలో పడిందని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, ఉపాధ్యక్షులు ముత్తు అశోక్, కోశాధికారి అరుణ్‌లోయ, నాయకులు కుమ్మరి తిరుపతి, మందాడె సుధాకర్, రాజేందర్ జంజోడ్, మహేశ్వరాచారి పాల్గొన్నారు.

పశుమిత్రలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పశు మిత్రులను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని జిల్లా పశుమిత్రల సంఘం అధ్యక్షురాలు భారతి, కార్యదర్శి ఇందు డిమాండ్ చేశారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనాలు నిర్ణయించి ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశు మిత్రులను యూనిఫాం, గ్లౌజులు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మందుల కిట్స్ ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. కృత్రిమ గర్భధారణ శిక్షణ ఇవ్వాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం తమ హక్కుల కోసం కృషి చేయకపోతే రానున్న రోజుల్లో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పద్మ, సురేఖ శ్రీలత, మనీషా, వరలక్ష్మి అమృత, జయ పాల్గొన్నారు.

ఇసుక దోపిడికి..కొత్త మార్గం..!

- నీటిలో నుంచి తీసి..తెప్పలపై తీసుకువస్తూ
- నదీ తీరంలో భారీగా ఇసుక డంపులు
- ద్వారక గోదావరి నది తీరం కేంద్రంగా అక్రమ రవాణా
- నిద్ర మత్తులో మైనింగ్ శాఖ అధికారులు

నదీ గర్భంలోని ఇసుకను తరలించేందుకు అక్రమార్కులు కొత్త తరహా విధానాన్ని ఎంచుకున్నారు. నదిలోకి వెళ్లి ఇసుకను తోడి ట్రాక్టర్ల ద్వారా తరలించడం సాధారణ విషయమే. కానీ నదిలోకి సులువుగా వెళ్లలేకుండా నీటి ప్రవాహం అడ్డుగా ఉండటం.. అక్కడ్నుంచి ఇసుకను ఎలాగైనా బయటకు తీయాలనే ఆలోచనతో అక్రమార్కులు కొత్త మార్గాలను అనుసరిస్తున్నారు. నదిలోంచి తీసిన ఇసుకను తెప్పల ద్వారా నదీ తీరానికి చేరుస్తూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మామూలుగా తీసుకుంటూ అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నవతెలంగాణ-దండేపల్లి

అక్రమార్కులకు ఇసుక ప్రధాన ఆదాయ వనరుగా మారింది. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ప్రకృతి వనరులను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. మండలంలోని ద్వారక గోదావరి నది తీరం కేంద్రంగా అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. వేసవికాలం కావడంతో క్రమంగా గోదావరి నది నీటి నిలువ తగ్గుతుండడంతో వ్యాపారులకు వరంగా మారింది. ఇసుకకు భారీగా డిమాండ్ ఉండడంతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నది మధ్యలోకి వెళ్లి నీటిలో నుంచి తోడి.. తెప్పలపై తీసుకువచ్చి.. ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతిరోజు తెప్పలపై తీసుకువచ్చిన ఇసుకను రహస్య ప్రాంతాలకు తరలించి నిల్వ చేస్తున్నారు.



తెప్పపై అక్రమంగా ఇసుక తరలింపు

అభివృద్ధి పేరిట ఇసుక అక్రమ రవాణ

గోదావరి నది నుండి, అటవీ ప్రాంతంలోని వాగుల నుండి అభివృద్ధి పనుల పేరిట ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. అభివృద్ధి పనులతో పాటు ప్రైవేటు భవన నిర్మాణాలకు వేకువ జామున, రాత్రివేళలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. మండలం నుండి ప్రతిరోజు 50కి పైగా ట్రాక్టర్ల ఇసుక తరలి వెళ్తుందని సమాచారం. ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.2500 నుంచి రూ.3000 వరకు వసూలు చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే ప్రతిరోజు సుమారు ఒక రూ.లక్షకు పైనే అక్రమ ఇసుక వ్యాపారం నడుస్తుంది. గోదావరి నది తీర ప్రాంత గ్రామాలలో భారీగా ఇసుక డంపులు ఉన్నాయని ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇసుక అక్రమ రవాణా వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని ఇప్పటికే తమ వ్యవసాయ బావులలో నీటి నిల్వ అట్టడుగు స్థాయికి చేరుకున్నాయని స్థానికులు చెపుతున్నారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోకుంటే భూగర్భ జలాలు అడుగంటి తమకు సాగు, తాగు నీరు కూడా దొరికే అవకాశం ఉండదని అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పత్తాలేని మైనింగ్ శాఖ అధికారులు

మైనింగ్ శాఖ అధికారుల నియంత్రణ కొరవడడంతో అక్రమ ఇసుక రవాణ మాఫియాకు ఆజ్యం పోసినట్లు అయింది. మైనింగ్ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో వాల్టా చట్టానికి తూట్లు పొడిచినట్లు అవుతుందని స్థానికులు విమర్శిస్తున్నారు. చర్యలు తీసుకోవాలని కోరితే అధికారులు తమ పరిధిలోకి రాదని తప్పించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా మైనింగ్ శాఖ అధికారి బాలును నవతెలంగాణ వివరణ కోరగా.. అక్రమ ఇసుక రవాణా అవుతున్నట్లు తమ దృష్టికి రాలేదని తమకు సమాచారం వస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్



నవతెలంగాణ-రెబ్బెన

గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని నంబాల గ్రామ పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోగె ఉపేందర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు రూ.15,600, బిల్ కలెక్టర్‌లకు, ఎలక్ట్రీషన్‌లకు, వాటర్‌మెన్‌లకు రూ.19,200, కారోబార్‌లకు రూ.26 వేలు, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీవో నెంబర్ 11 లేదా 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కారోబార్‌లను పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని, జిల్లాలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో గత నాలుగైదు నెలల నుండి వేతనాలు రాకపోవడంతో కార్మికులు తమ కుటుంబాలను పోషించలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా ప్రమాదబీమా రూ.20 లక్షలు అందించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి వెంకటేశం, నాయకులు పోశం, శ్రీనివాస్, సమ్మయ్య పాల్గొన్నారు.

హక్కుల గురించి మాట్లాడితే నక్సలైట్లు అంటూ ముద్ర

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసులు హక్కుల గురించి, ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాల గురించి ప్రశ్నించిన గిరిజనులపై నక్సలైట్లు అంటూ ముద్ర వేస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్నదని పేర్కొన్నారు. శనివారం నాగోబాను దర్శించడానికి వచ్చిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో కేస్లాపూర్ గ్రామానికి చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులకు భయపడొద్దు మీ అందరికీ నేను అండగా ఉన్నానని మీలాంటి ప్రజలకు అండగా ప్రశ్నించే గొంతుకగా పాదయాత్ర చేస్తున్నానని ధైర్యనిచ్చారు.

దేవాలయాల అభివృద్ధికి పెద్ద పీట

నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని తరోడా గ్రామంలో రూ.12 లక్షతో నిర్మించనున్న మాహాలక్ష్మి ఆలయ నిర్మాణం, తరోడ తండాలో రూ.12 లక్షలతో నిర్మించనున్న జగదాంబ దేవి ఆలయ నిర్మాణాలకు, శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రంలో నూతన ఆలయాల నిర్మాణాలకు కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందని అన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం త్వరలో ఇల్లు లేని పేదలకు గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరు చేస్తుందని అన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఎమ్మెల్యేను ఘనంగా గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, సర్పంచ్ శ్వేత రవికిరణ్ గౌడ్, ఎంపీటీసీ బండారి గంగాధర్, నాయకులు చిన్నాన్న, కిషన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంఘాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

కులసంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆజ్మీరా రేఖానాయక్ అన్నారు. శనివారం ఆమె పట్టణంలోని పలువార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీరాంనగర్‌లోని మున్నూరు కాపు సంఘానికి రూ.5 లక్షలు, మహాలక్ష్మి ఆలయానికి, రూ.2 లక్షలు, ఇంద్రానగర్‌లోని మజీద్ అభివృద్ధికి రూ.3లక్షలు నిధులు సంబంధించిన ప్రొసిడింగ్ కాపీలను సదరు సంఘ పెద్దలకు అందజేశారు. సీఎం కేసీఆర్ కులసంఘాలకు ఎంతో చేయూతనిస్తున్నారని పేర్కొన్నారు. సంఘాల పెద్దలు బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ ఖలీల్, నాయకలు వెంకాగౌడ్, పరిమి సురేష్, సంఘ పెద్దలు సతీష్‌రావు, అల్లాడి వెంకటేశ్వర్లు, గుమ్ముల లచ్చన్న, చంద్రహాస్, నాయిని శంకర్ ఉన్నారు.

ఆదివాసీ విద్యార్థినికి రక్తదానం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉయిక విష్ణు ఆదివాసీ గురుకుల పాఠశాల విద్యార్థి ముత్నూర్‌లోని పదో తరగతి చదువుతున్న కుమ్ర శ్రీజ అనారోగ్యంతో బాధపడుతూ ఉండటంతో రక్తం లేదని తెలిసిన వెంటనే సంఘం నాయకుడు వెంటనే స్పందించి విద్యార్థినికి రక్త దానం చేశారు. ఇందులో తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి బైరీ సోమేష్, నాయకులు కుమ్ర దీపక్, మెస్రం నార్మధ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మేకర్తి శ్యామ్‌కు ప్రభుత్వం నుండి మంజూరైన రూ.34 వేల సీఎంఆర్‌ఆఫ్ చెక్కును శనివారం మండల యూత్ అధ్యక్షుడు విద్యాసాగర్ బాధితుని ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన గొప్ప పథకం అని కొనియాడారు. ప్రభుత్వమే వైద్య ఖర్చుల కోసం బాధితులకు అందజేస్తున్నట్లు తెలిపారు. చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ గెలిచిన తరువాత ఏ చిన్న వైద్య సమస్య వచ్చినా బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా తక్షణమే మంజూరు చేయిస్తున్నారని అన్నారు. పేదల పాలిట వరంగా సీఎంఆర్‌ఎఫ్ పథకం అమలవుతోందని కొనియాడారు.

నిశ్చితార్థ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన ఆశన్న యాదవ్ సోదరుడి కుమార్తె నిశ్చితార్థం శనివారం సుంకిడి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హజరై శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట మండల కన్వీనర్ తోట వెంకటేష్, బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు ప్రకాష్, ఎంపీటీసీ వెంకటి నాయకులు గంగాధర్, సునీత, పొచ్చన్న ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సమస్యలు పరిష్కారం

- హాత్ సే హాత్ జోడు యాత్రలో సీఎల్పీ నేత బట్టి
- మంచినీళ్ల గోడు వెళ్లబోసుకున్న దస్నాపూర్‌గూడ ప్రజలు
- పంటలకు నీళ్లు సరిపోతలేవని రైతుల ఆవేదన



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజా సమస్యల పరిష్కారమవుతాయని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. శనివారం భట్టి చేపట్టిన యాత్ర ఖానాపూర్ నియోజకవర్గంలో 20 కిలోమీటర్లు కొనసాగింది. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలోని సిరికొండ మండలం కొండాపూర్ నుంచి ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్, కేస్లాపూర్, ముత్నూర్, ఇంద్రవెల్లి మండల కేంద్రం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పాదయాత్రకు మహిళలు మంగళ హారతులు పట్టుకొని స్వాగతం పలికారు. 20 కిలోమీటర్ల మేర కొనసాగిన పాదయాత్రలో దారి పొడవున ప్రజలను పలకరిస్తూ, వారి సమస్యలు తెలుసుకున్నారు.

కాంగ్రెస్ హయాంలో తవ్వించిన చేతబావే దిక్కయింది...

కొండాపూర్ నుంచి ప్రారంభించిన పాదయాత్ర ఇంద్రవెల్లికి బయలుదేరుతుండగా మార్గమధ్యలోని దస్నాపూర్‌గూడ గ్రామానికి చేరుకోగా ప్రజలు ఎదురొచ్చి తమ సమస్యలను విన్నవించారు. గూడెంలో 70 ఏండ్లు ఉన్నాయని గత కాంగ్రెస్ హయాంలో తవ్వించిన ఒక్క చేతి బావి మాత్రమే తాగడానికి తమకు దిక్కైందని వాపోయారు. కమిషన్ల కోసం మిషన్ భగీరథ పథకంలో రెండు వాటర్ ట్యాంకులు నిర్మించి, బిల్లులు తీసుకొని వాటికి ఇప్పటివరకు కూడా నీటిని సరఫరా చేయడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండాకాలం వస్తే ఈ చేతి బావి కూడా అడుగంటి పోవడం వల్ల మూడు కిలోమీటర్ల దూరం పోయి మంచినీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ప్రతి ఏటా తాము అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చేతిబావిని సందర్శించిన భట్టి విక్రమార్క మహిళలతో మాట్లాడారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువెళ్లారా అని అడగగా ఎన్నిసార్లు తీసుకువెళ్లినా ఎవరు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు బదులిచ్చారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడుగగా ఏ ఒక్కటి రావడం లేదని అన్నారు. మీరు చెప్పిన ప్రతి సమస్యను తప్పనిసరిగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు.

పిట్ట బొంగరంలో రచ్చబండ

పాదయాత్రలో భాగంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పిట్ట బొంగరం గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద గ్రామస్తులతో రచ్చబండ నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు నుంచి అందుతున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. గిరిజన గ్రామాలకు ఐటీడీఏ పీఓ రావట్లేదని సమస్యలు తీర్చడం లేదని హామీలు ఇచ్చే అధికారులను ప్రభుత్వం తక్షణమే బదిలీ చేస్తుందని, దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు తమ ఆవేదన వెలిబుచ్చారు. ఐటీడీఏ ప్రాజెక్టు ద్వారా వ్యవసాయం చేసుకోవడానికి కావాల్సిన సాయం అందడం లేదని అన్నదాతలు తమ సమస్యలు విన్నవించారు. తాము సాగు చేసుకుంటున్న పొలాల్లో బోర్లు వేసుకోవడానికి మంజూరు చేసినప్పటికీ కరెంటు కనెక్షన్ ఇవ్వకుండా అటవీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, వేధింపులకు గురి చేస్తున్నారని వివరించారు.

జన చైతన్యయాత్రలో భాగస్వాములు కావాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బి.రవికుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 23 నుండి 29 వరకు సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో చేపట్టే జన చైతన్యయాత్రలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ కోరారు. శనివారం కాగజ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జనచైతన్య యాత్ర వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద, కార్పోరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ, సంక్షేమం, మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడేందుకు ఈ జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాలు మోపుతోందని అన్నారు. లక్షల కోట్లు ఖర్చు పెట్టి బలోపేతం చేసిన ప్రభుత్వరంగాన్ని కార్పోరేట్లకు అమ్మేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, డి.రాజ్‌కుమార్, అల్లూరి లోకేష్, జాదవ్ రాజేందర్, గొడిసెల కార్తీక్, పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పీచర గ్రామ సర్పంచ్ బుర్రి భూమేష్ అమ్మ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆమె మృతిపట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో డీసీసీ అధ్యక్షుడు డి.ముత్యంరెడ్డి, సరికెల గంగన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీచర ఎంపీటీసీ తిప్పని రాజేశ్వర్, ముత్యంరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఘనంగా విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కట్ట మైసమ్మ విగ్రహాన్ని శనివారం ఘనంగా ప్రతిష్టించారు. ఉదయం 10:18 గంటలకు కట్ట మైసమ్మ సింహవాహన, శిఖర యంత్ర ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముందు ఉదయం ఆరు గంటల నుండే సుప్రభాతం, వేద పాదరాయణం, యంత్ర అభిషేకములు కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప-రమాదేవి దంపతులు అమ్మవారి విగ్రహానికి పట్టువస్త్రాలను సమర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కచ్చకాయల అంజయ్య, కార్యదర్శి నగేష్, కోశాధికారి శంకర్, కార్యనిర్వాహక అధ్యక్షులు నవీన్‌గౌడ్, ముఖ్య సలహాదారులు కట్ట ప్రసాద్, సదానందంతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జైలు జీవితం ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలి

- సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జైలు జీవితం ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేష్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ సబ్-జైలుని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలు కలియ తిరుగుతూ ఖైదీలకు అందిస్తున్న ఆహార వివరాలు తెలుసుకోవడంతో పాటు ఖైదీల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల జైలు జీవితం గడపాల్సి వస్తుందన్నారు. చేసిన తప్పులు సరిదిద్దుకొని భవిష్యత్తులో అటువంటి తప్పులు చేయకుండా చూసుకోవాలన్నారు. జైలు జీవితం ఖైదీలో పరివర్తన తీసుకురావాలన్నారు. ఖైదీలకు చట్టాల గురించి వివరిస్తూ చట్టాల గురించి తెలుసుకోవడం సమాజంలో ప్రతి ఒక్కరి భాధ్యత అని చట్టాల గురించి అవగాహన లేకపోవడం వల్లనే నేరాల సంఖ్య పెరుగుటనుందన్నారు. మధ్యం సేవించడం, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల మానసిక పరిస్థితి అదుపు ఉండదని నేరాలకికారణం మానసిక పరిస్థితి అదుపు తప్పడమేనని అన్నారు. అందరు మానసికంగా ధృడంగా ఉండాలని నేరాలు చేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో అడ్వకేట్లు నరహరి, విద్యాసాగర్, జైల్ సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని కిమ్స్ మల్టి స్పెషాలిటీ ఆసుపత్రిలో శనివారం శ్రీకొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో 17 మందికి పరీక్షలు నిర్వహించగా నలుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి లయన్స్ క్లబ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత తెలిపారు. ప్రతీ శనివారం నిర్వహించే ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో అప్తామలజిస్టులు ఇలియాస్, గోపి పాల్గొన్నారు.

ఇండ్ల కేటాయింపులో అవినీతిపై 20న ధర్నా

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయంపులో జరిగిన అవినీతి అక్రమాలపై ఈ నెల 20న మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్కో డబుల్ బెడ్ రూం కేటాయింపులో రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు చేతులు మారాయని ఆరోపించారు. అనర్హులకు ఇండ్ల కేటాయించి అర్హులకు అన్యాయం చేసిన ఘనత అధికారపార్టీ ఎమ్మెల్యేకు, కౌన్సిలర్లకు దక్కిందని విమర్శించారు. సోమవారం నిర్వహించే ధర్నాకు బాధితులు తరలిరావాలని కోరారు.

గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

నవతెలంగాణ-నార్నూర్



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం 11 మంది గర్భిణీ మహిళలకు హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ ఉచిత న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. గర్భిణీ మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా న్యూట్రిషన్ కిట్లు అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా మండలంలోని నాగల్‌కొండ, భవానిగూడ గ్రామంలో వైద్యసిబ్బంది జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. సీహెచ్ఓ అదీప్, సర్పంచులు జాదవ్ సునీత, యాదవ్ రావ్, నాయకులు కుమ్ర రాహుల్, ఇస్రు పటేల్, వైద్యసిబ్బంది గోకుల్, విద్యారాణి, హేమబిందు, ఆశాలు సరిత, భోజ్జు బాయి, జంగుబాయి, ఉపాధ్యాయులు సుధాకర్, యూత్ సభ్యులు కిషన్, గజానంద్ ఉన్నారు.

ఘనంగా సాంప్రదాయ దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సాంప్రదాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ పున్నారావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంప్రదాయానికి అనుగుణంగా ఉపాధ్యాయ సిబ్బంది, అలాగే విద్యార్థిని, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు చీర, దోతి, పంచే ధరించారు. అలాగే ఆధునిక ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, ఎన్‌సీసీ, ఎన్ఎస్-ఎస్ అధికారి గాలి అశోక్, లెక్చరర్లు నర్సింగ్, శాంతి, రవళి, సాధన విద్యార్థులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడ్డ కోచ్ సస్పెన్షన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడల పేరిట క్రీడాకారిణీలను కోచ్ లైంగికంగా వేధింపులకు పాల్పడుతున్నారన్న ఘటన చర్చనీయాంశంగా మారింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గల క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులను పాఠశాలకు చెందిన అథ్లెటిక్స్ కోచ్ రవీందర్ గత కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. తమను గత కొంత కాలంగా కోచ్ లైంగిక వేదింపులకు గురి చేస్తున్నారన్న విషయాన్ని విద్యార్థినులు శనివారం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ స్పందించి సదరు కోచ్‌ను సస్పెండ్ చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని శనివారం జిల్లా ఇంటర్మీడయట్ అధికారులు పరుశురాం, తుకారాం, రవికిరణ్, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 298 విద్యార్థులకు గాను 293 విద్యార్థులు హాజరయ్యారు. 5 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ మారుతి తెలిపారు.

బోథ్‌లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం



నవతెలంగాణ-బోథ్

మండలంలో శనివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అలాగే రైతులు పండించిన జొన్న, మొక్క జొన్న, గోధుమ, నువ్వులు, వడగండ్లతో నేలకొరిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే విద్యుత్ స్తంబాలు చెట్లు విరిగిపడ్డాయి. సొనాల సాకెర, ధన్నూర్(బి) బోథ్, కౌట(బి), గుర్రాల తండా అయా గ్రామాల్లో ఇండ్లపై రేకులు ఎగిరి పోయాయి. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆదర్శపెండ్లి జంటకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-బేల

మండలంలోని సదల్‌పూర్ గ్రామపంచాయతీలో కరోని(కె) గ్రామానికి చెందిన దివ్యాంగుడు మెస్రం నాగేష్‌ను గాదిగూడ మండలం కట్టగూడ గ్రామానికి చెందిన సరస్వతి పెళ్లి చేసుకొని ఆదర్శంగా నిలిచింది. పెళ్లి వేడుకల్లో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్ రెడ్డి హాజరై రూ.5వేలు అందజేసి వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు సదల్‌పూర్ సర్పంచ్ రాందాస్, మాజీ సర్పంచ్ ఘన్ శ్యామ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు మడావి చంద్రకాంత్, విపిన్ ఠాక్రే, రాకేష్, నరేందర్, కన్య ప్రభాకర్ రెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

రామాలయంలో ఘనంగా యజ్ఞ పూజలు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని రామాలయంలో శనివారం స్వస్తి పుణ్యావచనం, అగ్ని ప్రతిష్ట యజ్ఞం, స్థాపిత మండల దేవత పూజలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు రాజశేఖర్ శర్మ, నరహరి శర్మ, సంతోష్ శర్మ రతన్ శర్మల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం రోజు ధ్వజస్తంభ స్థాపన, అన్నదానం కార్యక్రమం నిర్వహించబడుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సర్పంచ్ అరుగుమీద రాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్న రామయ్య ఎంపీపీ కోండ్ర రేఖా రమేష్, భజన మండలి బోలి గంగారాం దంపతులు, వెంకట్‌రావు దంపతులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

నవతెలంగాణ-ఉట్నూర్

హరితాహారంలో కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీఓ తిరుమల అన్నారు. శనివారం బిర్సాయిపేట్ గ్రామంలో ఉన్న నర్సరీని ఈజీఎస్ ఏపీఓ రజినీకాంత్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మొక్కలు నాటే సమయానికి నర్సరీలలో మొక్కలు పెరిగేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వేసవికాలం అయినందున మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీరు అందించాలని సిబ్బందికి సూచించారు. నాటిన ప్రతీ మొక్కను కాపాడుకోవాల్సిన భాద్యత అందరిపైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్బంది ఉన్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహా ప్రతిష్టపాన



నవతెలంగాణ-లక్ష్మణచాంద

పీచర గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహా ప్రతిష్టపాన కార్యక్రమం అంగరంగ వైభవంగ కొనసాగింది. ఉత్సవంలో భాగంగా శనివారం గ్రామం నుండి ఆలయం వరకు ఆడపడుచులు భక్తిశ్రద్దలతో బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు. చిన్నారులు ఆటపాటలతో గ్రామంలో సందడి నెలకొంది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు

ఒంటిపూట బడి అమలు చేయాలి

- మే నెలంతా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ ఒకేసారి సెలవులు ఇవ్వాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడి అమలు చేయాలని, మే నెలంతా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్‌కు ఒకేసారి సెలవులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శనివారం డీడబ్ల్యూఓ కార్యాలయంలో తెలంగాణ అంగన్‌వాడీ, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వేసవి కాలం ప్రారంభమైందన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ముందుగానే రాష్ట్ర ప్రభుత్వం 2023 మార్చి 15 నుండి ఒక పూట బడిని ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు ప్రభుత్వ పాఠశాలలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే ఐసీడీఎస్ పరిధిలో అతి చిన్న వయస్సు పిల్లలతో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. అత్యధిక శాతం అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఎలాంటి సౌకర్యాలు లేక ఇరుకు గదుల్లో ఉన్నాయని, ఉన్న కొద్దిపాటి పక్కా భవనాలలో సరైన సౌకర్యాలు లేవని అన్నారు. పెద్ద వయసు పిల్లలు మధ్యాహ్నం తర్వాత ఇంటి వద్ద ఉంటున్నప్పుడు చిన్న వయస్సు పిల్లలను సాయంత్రం వరకు ఉంచాలంటే పిల్లల తల్లిదండ్రులు ఇష్టపడటం లేదని అన్నారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలు ఎండలో కేంద్రాలకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే మే నెలలో అంగన్‌వాడీలకు, హెల్పర్స్‌కు 15 రోజుల మేర విడివిడిగా సెలవులు ఇస్తున్నారని అన్నారు . దీంతో పని భారం పెరుగుతుందన్నారు. మే నెలంతా టీచర్స్, హెల్పర్స్ ఇద్దరికీ ఒకేసారి సెలవులు ఇవ్వాలని అన్నారు. అలాగే కేంద్రాలకు ఒకపూట బడిని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజమణి, లలిత, శశికళ, శైలేజ, గంగామణి, విజయ, దేవి, రమ్య, స్వర్ణలత, బాగ్యాలక్ష్మీ, అంగన్‌వాడీలు, హెల్పర్స్ పాల్గొన్నారు.

రంజాన్ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పవిత్ర రంజాన్ మాస, ఉపవాస దీక్షలు సాంప్రదాయబద్ధంగా, సమన్వయంతో నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక ఎమ్మెల్యే, ఎస్పీలతో కలిసి రంజాన్ మాస ఉపవాస దీక్షలు, పండుగను నిర్వహణపై ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ పండుగ నేపథ్యంలో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు నిర్వహించుకునేందుకు, అవసరమైన మౌళిక సదుపాయాలు, పారిశుద్యం, తాగునీరు, విద్యుత్ వంటివి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలుగకుండా జిల్లా వ్యాప్తంగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. సమావేశంలో పలువురు సూచించిన, లేవనెత్తిన అంశాలను నమోదు చేసుకోవడం జరిగిందని అన్నారు. ఆయా శాఖల ద్వారా అన్ని ఏర్పాట్లు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నెల రోజుల పాటు జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉండి సహకారం అందించడం జరుగుతుందని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్‌కు వచ్చే సమస్యలను ఆయా శాఖలకు తెలియజేసి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ రంజాన్ మాసంలో తాగునీరు సరఫరాలో లీకేజీలు లేకుండా మున్సిపల్, పంచాయతీ, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టాలని అన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి కాలనీ వాసులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. గ్రామాలు, పట్టణాలలో ఫాగింగ్ నిర్వహించాలని అన్నారు. ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పండుగల వేళ పోలీస్ యంత్రాంగం మరింత కట్టుదిట్టంగా శాంతిభద్రతలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రోడ్డుమీద వాహనాలు నిలుపకూడదని, ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలని అన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయకుండా యువతకు మతపెద్దలు వివరించాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చెత్తసేకరణ రోజువారీ జరుగుతుందని, ఎలాంటి సమస్య ఉన్న కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. వార్డు స్థాయి అధికారులు గతంలో మాదిరిగా పర్యటించి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు మతపెద్దలు, అధికారులు, ప్రజాప్రతినిధులు వారి సలహాలను వివరించారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ రమేష్ రాథోడ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కృష్ణవేణి, పలువురు మతపెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్ ఏకగ్రీవ ఆమోదం

- 2023-24 నిర్మల్ పురపాలక అంచనా బడ్జెట్ రూ.80 కోట్ల 24 లక్షలు
- నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్మల్ పురపాలక అంచనా బడ్జెట్ సమావేశాన్ని శనివారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మెన్ గండత్ ఈశ్వర్ అధ్యక్షతన కొనసాగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ వరుణ్ రెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ చైర్మెన్ కౌన్సిల్ సభ్యులు కలెక్టర్‌కు పూలమొక్కను ఇచ్చి, శాలువాతో సన్మానించారు. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 42 వార్డులలో నెలకొన్న సమస్యలు, అవసరాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. 2023-24 నిర్మల్ పురపాలక అంచనా బడ్జెట్ రూ.80 కోట్ల 24 లక్షలుగా ఏకగ్రీవంగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పట్టణ అభివృద్ధికి అందరూ సమన్వయంతో సహకరించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర నిధులతో ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టాలని అన్నారు. మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ మాట్లాడుతూ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సహాయ, సహకరాలతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పట్టణంలో నెలకొన్న సమస్యలను గుర్తించి, రాష్ట్రంలోనే నిర్మల్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. అందరూ సహకరించాలని కోరారు. అనంతరం ప్రస్తుత మున్సిపాలిటీ కార్యాలయం శిథిలావస్థకు చేరినందున, గతంలో వెనకాలే నిర్మించిన నూతన కార్యాలయాన్ని కలెక్టర్, మున్సిపల్ చైర్మెన్, కౌన్సిల్ సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, ఇంజనీరింగ్ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ ఎజెండా అని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం పట్టణంలోని వార్డ్ నెంబర్ 42 రిక్షా కాలనీలో రూ. 30 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, వార్డ్ కౌన్సిలర్ ఆవుల వెంకన్నతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం అర్హత గల 320 మంది లబ్ధిదారులను గుర్తించి, ఆసరా కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ దేశంలో ప్రజల అవసరాలను గుర్తించి, నిరంతరాయంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ మాత్రమేనని అన్నారు. ప్రతి వార్డులో క్రీడా ప్రాంగణాలు, ఓపెన్ జిమ్‌లు, గ్రీనరీ పార్కుల కోసం కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నామని అన్నారు. బస్తీ దవాఖానాలతో ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేశామని అన్నారు. ప్రజా సంక్షేమం, ప్రజా వ్యతిరేకత గల పార్టీలను ప్రజలు గుర్తించి, చర్చలు జరపాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై అప్పుల భారాన్ని మోపుతూ నిత్యవసర వస్తువుల రేట్లను అమాంతంగా పెంచుతోందని అసహనం వ్యక్తం చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి ఆర్థిక సంక్షోభంలో ప్రజలను నెట్టేస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జైహిర్ రంజాని, పట్టణ అధ్యక్షులు అజయ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, బీసీ సంఘం పట్టణ అధ్యక్షులు రమేష్, కౌన్సిలర్ డాక్టర్ లక్ష్మణ్, కోఆప్షన్ సభ్యులు ఏజాజ్, నాయకులు రాజు, కుమ్ర రాజు, సృజన్ రెడ్డి, మీషు, మున్సిపల్ డీఈ తిరుపతి, ఆర్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది సమయ పాలన పాటించాలి



నవతెలంగాణ-నార్నూర్

ఆస్పత్రిలోని వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సమయపాలన పాటించి, నాణ్యమైన వైద్యం అందించాలని అన్నారు. ఆస్పత్రిలో రోగుల వివరాలు మందుల స్టాక్‌ను పరిశీలించారు. ముందుగా ఏకలవ్య గురుకులం పాఠశాలను సందర్శించి, విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. వారి వెంట ఆర్డీఓ గంగాధర్, వైద్యురాలు రాజమణి, హెచ్ఈఓ నాందేవ్, సూపర్వైజర్‌లు, సత్యవ్వ, చరణ్‌దాస్ వైద్యసిబ్బంది ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

కలుషి ఆహారం, నీటి వల్లే విద్యార్థినులకు అస్వస్థత...

మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులం పాఠశాలలో కలుషిత ఆహారం, నీటితోనే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్టు వైద్యులు పేర్కొన్నారు.

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో పాము కలకలం

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో పాము కలకలంతో విద్యార్థిని ఆందోళనకు గురైంది. విద్యార్థిని పాము కాటుకు గురైన విషయం ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. శుక్రవారం సాయంత్రం తరగతులు ముగిసిన అనంతరం విద్యార్థిని హాస్టల్‌కు వెళ్లే దారిలో పాముపై కాలు వేసింది. భయంతో స్థానిక ఆస్పత్రిలో విద్యార్థినికి ప్రాథమిక చికిత్స నిర్వహించి, యాంటీ స్నేక్ ఇంజక్షన్ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థిని కాలుపై ఎలాంటి కాట్లు లేకపోవడంతో యూనివర్సిటీ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థినికి మెరుగైన చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స నిర్వహించి, విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచార అందించారు. విద్యార్థిని తల్లిదండ్రులతో వారి సొంత ఊరికి పంపించారు. ఈ మేరకు యూనివర్సిటీ పీఆర్ఓ విజయ్ కుమార్ ప్రెస్‌నోట్‌ను విడుదల చేశారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్ష కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ మారుతి శర్మ తనిఖీ చేశారు. ద్వితీయ సంవత్సరం రెండో రోజు కొనసాగిన పరీక్షకు మొత్తం 274 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా, అందులో 9 మంది పరీక్షకు గైర్హాజరై 265 మంది పరీక్ష రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్, కళాశాల ఇన్‌చార్జి బాలాజీ కాంబ్లె తెలిపారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన అల్లే నర్సవ్వ అనే మహిళ మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని శనివారం మంత్రి ఐకే రెడ్డి వ్యక్తిగత సహాయకులు కృష్ణంరాజు తన వంతు సాయంగా రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. నర్సవ్వకు నలుగురు ఆడపిల్లలు కాగా విషయం తెలుసుకొని వారిని పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటూ భవిష్యత్తులో మరే అవసరానికి అయిన తాను ఉంటానని కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఆర్ మిత్ర బృందం ఎఢ్ల రాజేశ్వర్, దూడ శ్రీనివాస్, బొమ్మన రాకేష్, కాలేరి దివాకర్, సంగర్తి రాజన్న, దాసరి శ్రీనివాస్, మామిడిపల్లి రాజకుమార్, ములుగురి నవీన్, సుంకర పెల్లి సురేష్, ద్యావతి గోపి పాల్గొన్నారు.

అంజనేయ విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-తలమడుగు

రుయ్యాడి గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆంజనేయ విగ్రహాన్ని విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి శనివారం ప్రతిష్టాపన కార్యక్రమానికి హజరయ్యారు. అదే గ్రామానికి చెందిన గోక సుభాష్ రెడ్డి గ్రామస్తుల సహకారంతో దాదాపు రూ.5 లక్షల వ్యయంతో విగ్రహాన్ని నిర్మించారు. గ్రామ సమీపంలోని వాగు ఒడ్డు పక్కన 12 ఫీట్ల ఎత్తుగల ఆంజనేయ విగ్రహాన్ని నెలకొల్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, గ్రామస్తులు అయ్యన్న, సాంబశివ, ప్రకాష్ రెడ్డి, కేదారీశ్వర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, గంగన్న, విష్ణువర్ధన్ రెడ్డి, సుభాష్ రెడ్డి, గ్రామస్తులు వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

పెర్సాపేన్ మండప ప్రారంభోత్సవం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని కేస్లాగూడ గ్రామంలో హెరే కుంర పెర్సాపెన్ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు హజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 19 మార్చి 2023

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కెనరా బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ నిజామాబాద్ రీజినల్ కార్యాలయ డివిజనల్ మేనేజర్ రాఘవేంద్ర అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన కెనరా బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంక్ సేవలను మరింత విస్తృత పరిచేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ వంశీకృష్ణ, సిబ్బంది హరీష్ పాల్గొన్నారు.

వలస కూలీలకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-జైపూర్

కూలీ పని కోసం వలస వచ్చిన కూలీలకు అటవీ అభివృద్ధి సంస్థ ద్వార ఉచిత వైద్య పరిక్షలు నిర్వహించారు. అనకాపల్లి (ఆంధ్రప్రదేశ్) నుండి వచ్చిన వలస కూలీలు స్థానిక నీలగిరి ప్లాంటేషన్‌లో ఆవసంగా ఉండే వారికి శనివారం పనుల నిర్వాహణ తీరుపై అవగాహణ కల్పించారు. ఈ సంధర్భంగా జైపూర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ద్వార ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం ద్వారా వలస కూలీలకు ఉచిత వైద్య పరిక్షలు, ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డివిజనల్ మేనేజర్ శ్రావణి, వైద్య ఆరోగ్య విభాగం మంచిర్యాల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాంమూర్తి, సబ్ యూనిట్ అధికారి గుండేటి నాందేవ్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ కుమార్, ఈ లక్ష్మన్ ఏఎన్ఎం మల్లేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

- ఎమ్మెల్యేకు ఎస్ఎఫ్ఐ వినతి



నవతెలంగాణ-మంచిర్యాల

హాజీపూర్ మండలం పడతనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విజేత సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. శనివారం పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావుతో పాటు మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బియ్యం సరఫరా కావడం లేదని అన్నారు. నాణ్యతలేని బియ్యంతో భోజనం చేయడం ఇబ్బందిగా ఉందని విద్యార్థులు తెలిపినట్లు ఆయన వివరించారు. పౌష్టిక ఆహారం అందించాలని, మధ్యాహ్న భోజన వర్కర్లకు నెలవారి వేతనము రూ.3000 పెంచి అందించాలని డిమాండ్ చేశారు.

సీపీఆర్‌ఎస్‌పై అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని ఆంగ్రేజ్‌పల్లి గ్రామంలోని పీహెచ్‌సీ ఆస్పత్రిలో అకస్మాత్తుగా మనిషికి గుండెపోటు వస్తే ఎలా సీపీఆర్ఎస్ చేసి ప్రాణాలు కాపాడే విదానంపై శనివారం ఆస్పత్రిలో సిబ్బందికి అవగాహన కల్పించారు. డాక్టర్ రాజేశ్ ఆధ్వర్యంలో గుండె పోటూ వస్తె తక్షణమే స్పందించి సీపీఆర్ఎస్ చేయు విదానాన్ని వివరించారు. ఏఎన్ఎం, ఆషా కార్యకర్తలకు తగు సలహాలు సూచనలు చేశారు. ఎవరికైనా గుండె పోటు వస్తే ఆందోళన చెందకుండా సీపీఆర్ఎస్ చేయడం ద్వారా ప్రాణాలు కపడవచ్చని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు ముస్తా, హెచ్ఈఓ జగదీష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఎనగొంది గ్రామంలో సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండడంతో రూ.5 లక్షల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను చేపట్టామని తెలిపారు. ఈ రోడ్డు పూర్తయితే మారుమూల గ్రామమైన ఎనగొంది గ్రామం నుంచి మండలకేంద్రానికి సౌకర్యంగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని 28 గ్రామాల్లో కూడా జిల్లా పరిషత్ చైర్మన్ కోవలక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సహకారంతో సీసీ రోడ్డు పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో పాటగూడ సర్పంచ్ కొట్నాకె కిష్టు, ఉప సర్పంచ్ కొత్రంగి బాపురావు, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

మండలాధికారులతో రివ్యూ మీటింగ్



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు, ఎలక్ట్రిసిటీ అధికారులకు శనివారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ వేముర్ల సంతోష్ మాట్లాడుతూ వేసవికాలం నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు మంచినీరు అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు, ఎలక్ట్రిసిటీ అధికారులకు సూచించారు. మండలకేంద్రంలో లోఓల్టేజ్, మైనార్టీ ప్రగతి కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని గ్రామాలకు మంచినీటి సరఫరాకు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలుగకుండా చూడాలని జడ్పీటీసీ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణసింగ్, సర్పంచ్‌లు బొమ్మినేని అహల్యాదేవి, పోశమల్లు, మల్లేష్, కార్తీక్, శ్రీకాంత్, డాక్టర్ సుజిత్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సోని, ఎలక్ట్రిక్ ఏఈ ఇమ్రాన్‌ఖాన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిరుపతమ్మ పాల్గొన్నారు.

శివాలయంలో అభిషేకానికి వెండిదార పాత్ర విరాళం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని నంబాల శ్రీ ప్రసన్న పరమేశ్వర ఆలయం, శివాలయానికి మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన వారు వెండిదార పాత్రను శనివారం విరాళంగా అందజేశారు. బోనగిరి నారాయణ-పుష్పలత, బోనగిరి రమేష్-సాయిప్రసన్న, బోనగిరి భీమేష్-ఉషారాణి, తణుకు మురళీ-ప్రతిభ, తణుకు జగదీష్-వీణ దంపతులు కిలో 750 గ్రాముల వెండిదార పాత్రను విరాళంగా అందజేశారు. ఉదయం ఆలయ చైర్మన్ రంగు మహేష్‌గౌడ్, నంబాల గ్రామ సర్పంచ్ చెన్న సోమశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు కుర్సింగ రాజన్న, అడప కూశన్న, కుందారపు గురవయ్యల ఆధ్వర్యంలో వెండిదార పాత్రను ఆలయానికి విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కులస్తులు తణుకు తిరుపతి, బోనగిరి నారాయణ, అశోక్, ప్రకాష్, నాయకులు గుల్బం చక్రపాణి, కొలిపాక కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కబ్జా అవుతున్న వారసంత భూమి

- వెలిసిన శాశ్వత దుకాణ సముదాయాలు
- అవస్థలు పడుతున్న చిరు వ్యాపారులు
- పట్టించుకోని పంచాయతీ పాలకమండలి
- నాయకుల అండతో యథేచ్ఛగా ఆక్రమణలు



నవతెలంగాణ - సిర్పూర్(టి)

సిర్పూర్ వారసంత స్థలం గత కొన్నేండ్ల నుండి కొంతమంది వ్యక్తులు నాయకుల అండతో అక్రమంగా కబ్జా చేసుకొని ఇష్టారాజ్యంగా దుకాణ సముదాయాలు నిర్మమించుకుంటున్నారు. ఈ అక్రమణల విషయంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవటంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరించటంతో అక్రమార్కులు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారు. శాశ్వత భవనాలు ఏర్పార్చుకుని దుకాన సముదాయాలను నిర్మించి చిరు వ్యాపారులకు అన్యాయం చేస్తున్నారు. ప్రతి శనివారం నిర్వహించే వారసంతకు వంచే వినియోగదారులు, చిరు వ్యాపరులకు ఇక్కట్లు తప్పటంలేదు. వారసంతకు కేటాయించిన ఎకరం స్థాలాన్ని ఆక్రమారులకు నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా ప్రతినిధుల అండదండలతో కబ్జా..?

సిర్పూర్(టి) వారసంత నిర్వాహన కోసం సర్వేనెంబర్ 538లో 8 ఎకరాల 14 గుంటల భూమిని 1965 గ్రామ పంచాయతీ కొనుగోలు చేసింది. ఈ భూమిలో నుంచి ఒక ఎకరం వారసంత కోసం ఆ నాటి పంచాయతీ పాలకవర్గం కేటాయించింది. ఈ భూమిని కొంతమంది వ్యక్తులు కబ్జా చేసుకొని రేకులషెడ్లు, టేలాలు, శాశ్వత గృహాలు నిర్మించుకున్నారు. వీటిని తొలగించాలని 1991-2000, 2022 సంవత్సరంలో పంచాయతీ అధికారులు అక్రమార్కులకు నోటీసులు ఇచ్చారు. తహసీల్దార్ సమక్షంలో కబ్జాదారులు మేమే స్వయంగా తొలగిస్తామని లిఖిత పూర్వకంగా ఇచ్చినప్పటికీ వాటిని తొలగించకపోవడం వల్ల మరికొంతమంది ఉన్న స్థలాన్ని కబ్జా చేసుకుంటున్నారు. వీటిని తొలగించాలని పాలక మండలి పలుమార్లు హెచ్చరించిన మా షెడ్లను ఎలా తొలగిస్తారని ఎదురుతిరిగి రాజకీయ నాయకుల అండదండలతో రెచ్చిపోతున్నారు. డీటీసీటీ అప్రోవల్ మ్యాప్‌లోని స్థలం రోజురోజుకు ఆక్రామణకు గురవుతోంది.

ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

వారసంత భూమి కబ్జాకు గురికాగా మిగిలిన భూమిలో ఇబ్బందుల నడుమ ప్రతి శనివారం వారసంత కొనసాగుతోంది. మండలంలో చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు, సరిహద్దులో గల మహారాష్ట్రకు చెందిన ప్రజలు, వినియోగదారులు ప్రతివారం ఈ వారసంతకు వస్తుంటారు. అంగడిబజార్‌కు కేటాయించిన స్థలం సరిపోక సిర్పూర్, కౌటాల మార్గమధ్యలో గల ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపుల దుకాణాలు ఏర్పాటుచేసుకుంటున్నారు. దీంతో రోడ్డుపై దుకాణాలు ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. భూమి కబ్జాకు గురి కావడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు దృష్టి సారించాలి

వారసంత భూమి కబ్జా కావడం వల్ల ఇరుకు ప్రదేశంలో అమ్మకందారులు, వినియోగదారులు దానికితోడు పశువులు కూడా దీనిలోనే సంచరిస్తుంటాయి. వీటివల్ల కూడా ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కబ్జాకు గురైన స్థలాన్ని అక్రమార్కుల నుండి విడిపించి వారసంత నిర్వహణ కోసం కేటాయించిన స్థలాన్ని గ్రామ పంచాయతీకి చెందేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సదుపాయాలు కల్పించాలి

ప్రతి శనివారం జరిగే వారసంతలో పలు గ్రామాల నుండి కొనుగోలు దారులు పెద్ద ఎత్తునా వస్తుంటారు. దుకాణాలు ఇరుకుగా ఉండడం వల్ల ముఖ్యంగా వారసంతలో అంగడికి వచ్చే వారితో పాటు పశువులు కూడా ఇందులోనే సంచరిస్తాయి. ముఖ్యంగా తాగునీటి సమస్యతో పాటు మహిళలకు మూత్రశాలలు నిర్మించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే స్థలం లేకపోవడంతో ఒకరికొకరు తాకుకుంటూ వెళ్లడం వల్ల ఇబ్బందికరంగా ఉంటుంది.



- సంతోష్, వినియోగదారుడు

స్థలం సరిపోవడం లేదు

స్థలం ఇరుకుగా ఉండడం వల్ల కొనుగోలు దారులు పెద్ద ఎత్తునా రావడంతో దుకాణాలు పెట్టుకోవడానికి ఇరుకైన స్థలంలో వ్యాపారం సాగిస్తున్నాం. స్థలం ఆక్రమనకు గురి కాకుండా క్రమ పద్ధతిలో గ్రామ పంచాయతీ వారు షెడ్లు నిర్మిస్తే బాగుంటుంది. వార సంతంలో సౌకర్యాలు లేక పోవటంతో ఇబ్బందులు పడుతున్నాము.



- చిరువ్యాపారి రాంకుమార్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కబ్జా చేయబడిన స్థలంలో రేకుల షెడ్లు, గృహాలు, టేలాలు తొలగించాలని గతంలో మూడుమార్లు నోటీసులు ఇచ్చాం. ఇట్టి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. వారి ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకొని ఆక్రమణలను తొలగిస్తాం.



కృష్ణమూర్తి, గ్రామ పంచాయతీ ఈఓ, సిర్పూర్(టి)

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి

- టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల్కర్ సాయిరాం
- టీఎస్‌పీఎస్సీ ముట్టడికి యత్నించిన జిల్లా నాయకుల అరెస్టు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిరుద్యోగుల ఉసురు పోసుకుంటున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫోల్కర్ సాయిరాం డిమాండ్ చేశారు. చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన టీఎస్‌పీఎస్సీ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. హైదరాబాద్‌లో చేపట్టిన ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నాయకులను అదుపులోకి తీసుకొని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా నాయకుడు పోల్కర్ సాయిరాం మాట్లాడుతూ పరీక్ష పత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి అభ్యర్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా పరీక్ష పత్రాల లీకేజీతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయన రాజీనామా చేయాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని అన్నారు. టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ముట్టడి కార్యక్రమానికి మద్దతు తెలపడానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, రాష్ట్ర తెలుగు మహిళ నాయకురాలు సూర్యదేవరలతను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంటు నాయకులు చౌహాన్ పథ్వీరాజ్ పాల్గొన్నారు.

ప్రశ్న పత్రాల లీకేజీకి ప్రభుత్వం బాధ్యత వహించాలి

- మంత్రి కేటీఆర్ రాజీనామాకు బీజేపీ డిమాండ్



నవతెలంగాణ-మంచిర్యాల

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాలు లీకేజీ వ్యవహారానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు డిమాండ్ చేశారు. శనివారం ప్రశ్నాపత్రాల లీకేజీ విషయమై బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఆందోళన చేపట్టిన నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు మాట్లాడుతూ ప్రశ్నపత్రాల లీకేజీ కేసును సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షలకు సిద్ధం అవుతున్న యువతకు రూ.లక్ష నష్ట పరిహారం అందించాలి డిమాండ్ చేశారు. తెలంగాణ వస్తే మన ఉద్యోగాలు మనకు వస్తాయని ఆశించిన యువతుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం నిరాశ మిగిల్చిందని విమర్శించారు. ప్రశ్న పత్రాల లీకేజీ మంత్రి కేటీఆర్ అండదండలతో జరుగుతుందని ఆరోపించారు. ఒక్కరూ పేపర్ లీక్ చేయడం వలన ప్రభుత్వం తప్పు పట్టడం సరి కాదని మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నిరుద్యోగ యువత ఎవరు కూడా అధైర్య పడవద్దని బీజేపీ మీకు అండగా ఉండి నిరుద్యోగుల తరపున పోరాటం చేస్తుందని భరోసానిచ్చారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ తక్షణమే రాజీనామా చేయాలని, సిట్టింగ్ జడ్జితో ఈ కేసును విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోనుగోటి రంగరావు, పెద్దపల్లి పురుషోత్తం, అందుగుల శ్రీనివాస్, మునిమంద రమేష్, ఆకుల అశోక్ వర్ధన్, తుల ఆంజనేయులు, పట్టి వెంకట కష్ణ, జోగుల శ్రీదేవి, మధవరపు రమణ రావు, బద్దే లక్ష్మన్ వంగపల్లి వెంకటేశ్వర్ రావు, వీరమల్ల హరి గోపాల్, అగల్ డ్యూటీ రాజు, విశ్వంభర్ రెడ్డి, వేల్పుల శ్రీనివాస్, సప్పిడి నరేష్, కోడి రమేష్, బెరే రామన్న యాదవ్, అట్కపురం రమేష్, రాజ్ కుమార్, శ్రీకృష్ణ దేవరాయులు, అమిరిశెట్టి రాజు, బొయిని దేవేందర్, రెడ్డిమల్ల అశోక్ పాల్గొన్నారు.



విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు తిమ్మాపూర్ సర్పంచ్ జాడి గంగాధర్ అన్నారు. శనివారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రికెట్ వాలీబాల్ త్రోబాల్ షటిల్ ఇతర ఆట వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై మక్కువ చూపాలన్నారు. క్రమశిక్షణగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు చైర్మన్ బోర్లకుంట శంకర్, వార్డు సభ్యుడు జాడి వెంకటే, ఉపాధ్యాయులు రవీందర్, శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్ గంజాయిల జమున పాల్గొన్నారు.



ఆత్మహత్యల నివారణపై అవగాహన

తిమ్మాపూర్ జీపీ పరిధిలోని నాయకపుగూడ ప్రభుత్వ పాఠశాలలో ఆత్మహత్యల నివారణపై సర్పంచ్ జాడి గంగాధర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల హెల్త్ సూపర్‌వైజర్ కమలాకర్ మాట్లాడుతూ ఆత్మహత్యతో సమస్యలకు పరిష్కారం కాదని అన్నారు. నాయకపుగూడెంలో తరచు ఆత్మహత్యలు జరుగుతున్నాయని వాటిని నివారించేందుకే కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. చనికావేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితాన్ని అతలాకుతలం చేసి మరణానికి దారి తీస్తాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి లావణ్య, ఉపసర్పంచి ఆసనూరి పద్మ, చిన్నన్న వెంగాయ్య పాల్గొన్నారు.



వార్షిక క్రీడల బహుమతుల ప్రధానోత్సవం



నవతెలంగాణ-నస్పూర్

డబ్ల్యూపీఎస్ జీఏ 2022-23 వార్షిక క్రీడల బహుమతి ప్రధానోత్సవం శ్రీరాంపూర్ కాలనీలోని ప్రగతి స్టేడియంలో గల సీఈఆర్ క్లబ్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి పాల్గొని వివిధ క్రీడాంశాలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అలాగే కోల్ ఇండియా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు వివిధ క్రీడాంశాలలో తమ ప్రతిభను చాటి కోల్ ఇండియా స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించడం చాలా సంతోషకరమైన విషయమని, సింగరేణి సంస్థ క్రీడాకారులను ఎల్లవేళలా ప్రోత్సహిస్తుందని గుర్తు చేశారు. ఈ వార్షిక క్రీడలలో మహిళలు కూడా ఉత్సాహంగా పాల్గొని కోల్ ఇండియా స్థాయిలో రాణించడం అభినందనీయమైన విషయమని, ఈరోజు బహుమతులు అందుకుంటున్న విజేతలు అందరూ రాబోవు క్రీడ పోటీలలో కూడా తమ ప్రతిభను చాటాలని సూచించారు. కార్యక్రమంలో చిన్నారులు సేవా సభ్యురాళ్లు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో తెలంగాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదీర్, ఎస్ఓ టూ జీఎం త్యాగరాజు, డీజీఎం(ప) పి.అరవింద రావు, ఎస్ఆర్పీ గ్రూప్ గనుల ఏజెంట్ గోపాల్ సింగ్, డీవై సీఎంఓ డాక్టర్ పి.రమేష్ బాబు, స్పోర్ట్స్ హానరరీ సెక్రటరీ పాలకుర్తి రాజు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ తోట సురేష్ పాల్గొన్నారు.

ముస్లిం వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ముస్లిం వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ముఖ్య సలహాదారులుగా మీర్ సాబీర్ అలీ హాష్మి, షేక్ షబ్బీర్, సయ్యద్ అన్వార్, అవద్ బీన్ యహియా, ఎత్తేశం, గౌరవ అధ్యక్షులుగా అబ్దుల్ వహీద్(షబ్బీర్), అహ్మద్ బిన్ అబ్దుల్లా, సయ్యద్ నిసార్, ఎండి సాజీద్, అధ్యక్షుడిగా ఉబేద్ బీన్ యహియా(తారీక్), ఉపాధ్యక్షులుగా గులాం జావిద్, ఎండి.అహ్మద్, ఎండి తాజ్, ఎండి ఇమ్రాన్, షేక్ సలీం ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ రహమాన్, జాయింట్ సెక్రెటరీలుగా ఇమ్రాన్ హాష్మి, షేక్ షాకీర్, నజీర్, షేక్ మొహమ్మద్, రియాజ్ ఖాన్ కోశాధికారిగా మన్సూర్ బీన్ అబ్దుల్ రబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా అమ్రాన్ బిన్ సాలె, మున్వర్, మొహమ్మద్ మోహిన్, ఎండి.ఖలీల్, కోఆర్డినేటర్లుగా అబ్దుల్లా బిన్, అబ్దుల్ రఫీక్, ఉమర్, సలీం బేగ్, ప్రచార కార్యదర్శులుగా సయ్యద్ సోజర్, ఎండి ఖలీల్, ఇర్ఫాన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పురుగులమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కొర్విచెల్మ గ్రామానికి చెందిన జంజూరి రాజయ్య(85) అనే వృద్ధుడు అనారోగ్య కారణాలతో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు దండేపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య గత కొద్ది కాలంగా ఆస్తమా వ్యాధితో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు పలుమార్లు ఆస్పత్రిలో చూపించిన నయం కాలేదు. గత మూడు రోజులుగా తీవ్ర ఆస్తమాతో బాధపడుతూ శనివారం ఇంట్లో ఉన్న గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు లక్షెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో నాలుగో రోజు ఒకరు డిబార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో నాలుగో రోజు జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఒకరిని డిబార్ చేశారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీధర్ సుమన్ పలు సెంటర్లను సందర్శించి పరీక్ష జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడిస్తూ జిల్లా వ్యాప్తంగా జనరల్ 4046, ఒకేషనల్ 697 మొత్తం 4743 మంది విద్యార్థులకు గాను జనరల్ 3930, ఒకేషనల్ 652 మంది మొత్తం 4582 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మొత్తం 161 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఆసిఫాబాద్‌లోని పలు పరీక్షా కేంద్రాల్లో డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల వారు సందర్శించినట్లు వివరించారు. ఆసిఫాబాద్ గిరిజన సంక్షేమ బాలికల కళాశాలలో ఒక విద్యార్థిని ఫ్లయింగ్ స్క్వాడ్ మాల్ ప్రాక్టీస్ కింద డిబార్ చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తిచేయాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీఓ గంగాసింగ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని రైతువేదికలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఎంపీపీ జాజిమొగ్గ సుజాత అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు.

పాఠశాలలో వార్షికోత్సవం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎల్లూరు గ్రామంలో సెయింట్ క్లారెట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై విజయ్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఫ్రాన్సిస్ సిబి, ఫ్రాన్సిస్ డొమినిక్, ఫ్రాన్సిస్ థామస్, అనీష్ జోసెఫ్ పాల్గొన్నారు.

పరీక్ష సమయంలో ఒత్తిడికి గురి కావొద్దు



నవతెలంగాణ-తాంసి

విద్యార్థులు పరీక్ష సమయంలో ఏలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సైకాలజిస్ట్ డాక్టర్ ఓంప్రకాష్ విద్యార్థులకు సూచించారు. శనివారం మహిత స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ పాఠశాల, విద్యార్థులకు ఎస్సైతో పాటు సైకాలజిస్ట్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చదువు కొనే వయస్సులో చదువుపై మాత్రమే శ్రద్ధ ఉంచాలని అన్నారు. సెల్ ఫోన్ వాడటం మంచిది కాదని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఎవరికి పడితే వారికి ఫోన్ నంబర్‌లు ఇవ్వడం వీడియో కాల్స్ మాట్లాడం చేయకూడదని అన్నారు. ఒత్తిడి లేకుండా చదివి పరీక్షలు రాయాలని అన్నారు. పరీక్షలో ఫెయిల్ అయ్యాను అని దిగాలు పడి ఆత్మహత్యా ప్రయత్నం చేసుకోకూడదని అన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి, మంచి భవిష్యత్తుతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, ఎస్సై లాల్ సింగ్ నాయక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రావ్యవాణి, కస్తూరిబా గాంధీ పాఠశాల ఎస్ఓ అలైక్య, పాఠశాల సిబ్బంది అమరేందర్, మహిత కోఆర్డినేటర్ ఇమ్రాన్ ఖాన్, ఆరోగ్య సిబ్బంది తులసిరాం, మహిత సిబ్బంది రాజు ఉన్నారు.

ఇంటర్ పరీక్షకు 616 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా కొనసాగుతున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. నాలుగో రోజు శనివారం జరిగిన ఇంటర్ సెకండియర్ ఇంగ్లీష్ పరీక్షకు 616 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ వెల్లడించారు. మొత్తం 9,599 మందికి గాను 8983 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

విద్యుత్ లైన్‌ను పరిశీలించిన డీఈ

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని విటోలి గ్రామంలో శనివారం విద్యుత్ లైన్లను విద్యుత్‌శాఖ నిర్మల్ సర్కిల్ డీఈ రత్నకుమారి పరిశీలించారు. విటోలి గ్రామాన్ని దత్తత తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ప్రస్తుతం గ్రామంలో చేపడుతున్న పనులను పరిశీలించామని అన్నారు. డీఈ వెంట కమర్షియల్ ఏఈ మధుకర్, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా సభ్యుల అరెస్ట్

- కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ
- లక్షల విలువైన వస్తువులు స్వాధీనం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జాతీయ రహదారులపై లారీలను ఆపి వస్తువులను దోచుకుంటున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలోని ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌కు చెందిన 6మంది, ఆదిలాబాద్‌లోని షాద్‌నగర్‌కు చెందిన ముహమ్మద్ సాజిద్ ఖాన్ ఈ బృందంలో ప్రధాన సూత్రధారిగా భరత్‌పూర్ జిల్లా పహారీ తహసీల్ జిరాహిరా గ్రామానికి చెందిన 32 ఏండ్ల మహ్మద్ అర్షద్ బంధువు మహమ్మద్ సాజిద్‌ఖాన్ సహకారంతో రెండేళ్ల కింద నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో అరబిక్ టీచర్‌గా చేరిన రాజస్థాన్‌ని స్వర్ణ గ్రామానికి మారారు. నిందితుడు నెంబర్ వన్ మహమ్మద్ అర్షద్ గ్రామంలోని మసీదుకు నాయకత్వం వహించి, పిల్లలకు అరబిక్ భాష నేర్పేవాడు. రాజస్థాన్‌లో కంట్రీ మేడ్ పిస్టల్, 14 బుల్లెట్‌లను కొనుగోలు చేశాడని తెలిపారు. ఆ తర్వాత మరో ఆరుగురు వ్యక్తులతో కలిసి దొంగల ముఠాను ఏర్పాటు చేసుకున్నాడని ఎస్పీ తెలిపారు. తమ మొదటి పథకం ప్రకారం, నేరస్థులు ఏ1 సూచనల మేరకు తుపాకీలను ఉపయోగించారు. మార్చ్ 13వ తేదీ తెల్లవారుజామున 3.20 గంటలకు పటాన్ చెరు ప్రాంతంలోని మహీంద్రా స్కో విఎక్స్-10 బిలోని యమునా సమీపంలో ఇనుప రాడ్, కత్తిని తీసుకున్నారు. ఫ్లిప్కార్ట్ తీసుకెళ్తున్న పార్శిల్ వాహనానికి నిప్పంటించి అందులో ఉన్న రూ.లక్షా 78వేల 806 విలువైన ఫ్లిప్‌కార్ట్ పార్శిల్ దోచుకెళ్లి స్వర్ణ గ్రామానికి తీసుకొచ్చి ఏ1 ఇంట్లో జమ చేశారు. మరుసటి రోజున మార్చి 14వ తేదీ తెల్లవారుజామున 1.30 గంటలకు నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు హల్దీరామ్ సరుకులు తీసుకువెళుతున్న కంటైనర్ వాహనాన్ని ఆపి దొంగిలించారు. ఏ1 నుంచి ఏ6 వరకు ఇచ్చోడ శివారులోని దేవుల్ నాయక్ తండా బస్టాండ్‌లో ఆపి, ఆయుధాలతో కంటైనర్ డ్రైవర్‌ను బెదిరించి కత్తితో పొడిచాడు. అందులో ఉన్న సామాన్లు దోచుకెళ్లి డ్రైవర్‌ను బాల్కొండ మండలం శ్రీరాంపూర్ గ్రామంలో దింపారు. ఈ ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మహ్మద్ అర్షద్‌తో పాటు నసీమ్, జకీర్ ఖాన్, ముహమ్మద్ సాజిద్ ఖాన్, ముజాహిద్ ఖాన్, ముస్తాక్ ఖాన్ ఉన్నారు. ఈ మేరకు జిల్లాలోని ముస్లింలు, ముఖ్యంగా మసీదు కమిటీ అధికారులు మసీదుకు ఇమామ్ లేదా మౌజిన్‌లను నియమించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్థానికేతర వ్యక్తిని నియమించినట్లయితే, పూర్తి సమాచారం పొందిన తర్వాత మాత్రమే నియమించాలని అన్నారు. అలాగే. దొంగలను పట్టుకున్న ఇచ్చోడ సీఐ, సీసీఎస్ సీఐ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

స్వాధీనం చేసుకున్న సామాను వివరాలు...

రెండు తపంచ తుపాకులు, పద్నాలుగు బుల్లెట్లు, రెండు కత్తులు, రెండు ఇనుప రాడ్లు, రెండు కార్లు, తొమ్మిది మొబైల్ ఫోన్లు, ఒక బైక్, రూ 5.53 లక్షల కొట్టేసిన ఫ్లిప్ కార్ట్, హల్దీరాం సామాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీసీఎస్ సీఐ చంద్రమౌళి, ఇచ్చోడ సీఐ నైలు, గుడిహత్నూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్, ఇచ్చోడ ఎస్సై శ్రీకాంత్, నేరడిగొండ ఎస్సై సాయన్న సీసీఎస్ సిబ్బంది ఉన్నారు.



రంజాన్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలందరూ కలిసి పండుగలను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా నిర్వహించుకోవాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రంజాన్ మాసం సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయి, అదనపు ఎస్పీ ఏఆర్ భీమ్ రావులతో కలిసి ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుల వద్ద పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని, అవసరమైన చర్యలు తీసుకునే విధంగా అధికారులు ముస్లిం మత పెద్దలకు సమన్వయంతో శాంతియుతంగా పండగ జరిగేలా కృషి చేయాలని తెలిపారు. రంజాన్ సందర్భంగా మురుగు కాలువల పరిశుభ్రత, వాహనాల పార్కింగ్, రంజాన్ తోఫా కిట్ల పంపిణీ, తాగునీరు, విద్యుత్ సరఫరా సంబంధిత అంశాలపై ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసిఫాబాద్ పట్టణం, కాగజ్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మసీదుల వద్ద సాయంత్రం సమయంలో పారిశుధ్య పనులు చేపట్టే విధంగా కార్యచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే విధంగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మసీదులు, ఈద్గాల వద్ద గ్రామపంచాయతీ, మున్సిపల్ అధికారులు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. పండ్ల షాపులు రాత్రి సమయంలో ఉండే విధంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేశ్వర్, మైనారిటీ సంక్షేమ అధికారి షేక్ మహమ్మద్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రత్నమాల, జిల్లా పౌర సంబంధాల అధికారి కృష్ణమూర్తి, మండలాల తహసిల్దార్లు, మసీద్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఐఎఫ్టీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేష్

నవతెలంగాణ-ఖానాపూర్


ఐఎఫ్టీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలో ని విశ్రాంతి భవనంలో ఐఎఫ్టీయూ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25, 26, 27 తేదీలలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. బీజేపీ మోడీ ప్రభుత్వం 8సంవత్సరం కాలంలో లాభాలు ఆర్జించే ప్రభుత్వ రంగ పరిశ్రమలను, దేశ సంపదను,సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నదనీ అన్నారు. ఆయిల్ గ్యాస్, స్టీల్, బొగ్గు, కరెంట్, టెలికాం తదితర ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడానికి పెట్టారనీ, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్ లు తీసుకు వచ్చి కార్మికవర్గం నాశనం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. రాష్ట్రంలో 3 లక్షల మంది కాంట్రాక్టు కార్మికుల ను పర్మినెంట్ చేస్తానని హామీని అమలుచేయలేదనీ కేజీబీవీ ఆశ్రమపాఠశాలలో పనిచేస్తున్న దినసరి కూలీలను పర్మినెంట్ చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారనీ అన్నారు. అందుకే కార్మికుల హక్కుల కోసం,భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవటం కోసం ఈ మహాసభలు నిర్వహిస్తున్నామని ఈ మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న, ఉపాధ్యక్షుడు భూక్య విలాస్, భానవాత్ సంతోష్, ఏఐ కేఎంఎస్ ఉమ్మడి జిల్లాసహాయ కార్యదర్శిమంచికంటి లక్ష్మణ్ పాల్గొన్నారు.



ఉపాధిహామీ బిల్లుల్లో అవకతవకలు

- సామాజిక తనిఖీలో వెల్లడి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గ్రామీణ ఉపాధిహామీ చట్టంలో అవినీతికి పరాకాష్టగా మారింది. మండలంలో 2019 నవంబర్ నుంచి 2022 మార్చి వరకు జరిగిన రూ.26 కోట్ల పనులపై సామాజిక తనిఖీ నిర్వహించగా, శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆవరణలో ఎంపీపీ పోటే అధ్యక్షతన ప్రజావేదికను నిర్వహించారు. మొత్తం 28, జీపీల వారిగా ప్రజావేదికా నిర్వహించాల్సి ఉండగా, రాత్రి వరకు కేవలం పది, పన్నెండు జీపీల వరకే నిర్వహించారు. మొదట తేజాపూర్ జీపీలో చేసిన ఆడిట్‌పై నివేదికను వివరించగా, ఆ జీపీలో హరిత హారంలో భాగంగా 16 వేల మొక్కలు నాటగా ప్రస్తుతం కేవలం 6 వేల మొక్కలు మాత్రమే దర్శనమిస్తున్నాయని తెలిపారు. చాలా చోట్ల చేసిన వివిధ అభివృద్ధి పనులకు ఈసీ తనిఖీ చేయకుండానే మేజర్ చెల్లింపులు చేశారని వెలుగులోకి తీసుకువచ్చారు. ఇదే జీపీలో నిర్మించిన కంపోస్ట్ షెడ్డుకు తలుపులు, సింటెక్స్ నీటి ట్యాంకు పెట్టినట్లు రికార్డు చేసి బిల్లులు తీసుకున్న అక్కడ ఆడిట్ బృందానికి అవేమీ అగుపించలేదని అన్నారు. దీంతో పాటు అనేక జీపీల్లో చేసిన మెటీరియల్ చెల్లింపులకు సంబంధించిన ఎంబీలు తనిఖీ బృందానికి ఇవ్వలేదని వివరించారు. ఇలా ప్రతి జీపీలో చేసిన హరిత హారం పనులకు రికార్డులో వేల సంఖ్యలో చెట్లు పెట్టి దానికి సంరక్షణ పేరిట నిధులను మింగేశారని పేర్కొన్నారు. ఫీల్డ్ మీద చూస్తే సగానికి సగం మొక్కలు మాయమైపోయాయని అన్నారు. అనేక చోట్ల కూలీల జాబ్ కార్డులు అప్డేట్ చేయలేదని, మాస్టర్‌లో వైట్‌నర్‌తో బినామీ పేర్లు చెల్లింపులు చేశారని ప్రజావేదిక సాక్షిగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి హామీలో కింది స్థాయి మేట్ నుంచి ఎంపీడీఓ స్థాయి వరకు అవినీతికి మారు పేరుగా మారినట్లు తెలుస్తోంది. ఈ ప్రజావేదిక రాత్రి వరకు కొనసాగింది. ప్రజావేదిక పూర్తి వివరాలు రేపటిలోగా పూర్తి సమాచారం రానుందని తెలిపారు. ఈ ప్రజా వేదికలో అదనపు ఏపీడీ రాథోడ్ రాజేశ్వర్, పీడీ కిషన్, అప్పటి ఎంపీడీఓ రమాకాంత్ రావ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశం బహిష్కరణ

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ పురపాలక సంఘం వార్షిక బడ్జెట్ సమావేశాన్ని కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు శనివారం బహిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్న సత్యం మాట్లాడుతూ గడిచిన మూడేండ్ల నుంచి మున్సిపాలిటీకి వివిధ వనరుల ద్వారా వచ్చిన ఆదాయం, వివిధ పనులకు వెచ్చించిన ఖర్చుల వివరాలు తెలుపకుండా సమావేశం ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. జమా, ఖర్చులకు సంబంధించి పాలక సభ్యులు ఎన్నిసార్లు అడిగినా కమీషనర్, చైర్మెన్ సమాదానం చెప్పకుండా దాటవేస్తున్నారని అన్నారు. పట్టణంలో పందులు, కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కమీషనర్ చర్యలు తీసుకోవడం లేదన్నారు. పాలక సభ్యులు నిలదీసినప్పుడు మాత్రం కమీషనర్, చైర్మెన్ హడావుడి చేసి తదనంతరం సమస్యను గాలికొదిలేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కోరం లేక వాయిదా..

బడ్జెట్ తీర్మాణానికి సరిపడా పాలక సభ్యులు సమావేశానికి హాజరు కాకపోవడంతో వాయిదా పడినట్టు కమీషనర్ రత్నాకర్ రావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

మండలాభివృద్ధికి తోడ్పడాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పాటుపడాలని ఎంపీడీఓ రాజేశ్వర్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ సహదేవరావు ఆదేశాల మేరకు మండలస్థాయి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు గతంలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలు, జరిగిన పనుల గురించి నివేదికలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు వారు చెప్పిన సమాధానాలకు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో ఎలాంటి పనులు జరుగుతున్నాయో కనీసం ప్రజా ప్రతినిధులకు తెలియజేయకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా ప్రతి నెల మొదటి శనివారం, మూడో శనివారంలో జరిగిన సమీక్ష సమావేశానికి ముందుగా పనుల వివరాలను తెలియజేయాలన్నారు. అధికారులు తాము నిర్వహించిన పనులు తెలియజేస్తే ఈ సమావేశంలో చర్చించడానికి అవకాశముంటుందన్నారు. అలాగే ఎంపీటీసీ సోయల్ హైమద్ మాట్లాడుతూ కలెక్టర్ మండలస్థాయి సమావేశం నిర్వహించడం అభినందనీయమని, ఈ సమావేశంలో మండలాభివృద్ధికి తోడ్పాటుకు బాగుంటుందని, కానీ ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు హాజరుకాకపోవడం కేవలం ముగ్గురు ఎంపీటీసీలు, ఇద్దరు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారని, ఈ విధంగా ఉంటే మండలాభివృద్ధి పనులతో పాటు ప్రజలకు ఎంతవరకు న్యాయం జరుగుతుందో ఆలోచించాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-బెజ్జూర్

గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీడీఓ మాధవి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటుచేసిన మండలాభివృద్ధి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అందరు సహకరించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని గ్రామ పంచాయతీ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికల పాఠశాలలో భద్రతకు పటిష్టంగా చర్యలు

నవతెలంగాణ-బెజ్జూర్

గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో భద్రత పటిష్ట చర్యలు చేపట్టాలని డీఆర్పీ పంద్రం భిక్షమయ్య అన్నారు. శనివారం మండలకేంద్రంలోని సహస సేఫ్టీ క్లబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఉపాధ్యాయులకు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భద్రత పటిష్టంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్పీలు విలాస్‌కుమార్, మధునయ్య పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఇచ్చోడ

బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గైకాంబ్లే గణేష్ మేన కోడలు వివాహనికి శనివారం మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హాజరై నూతన వధువు వరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఆయన వెంట మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, రాథోడ్ ప్రవీణ్, అబ్దుల్ రషీద్, మారుతి సర్పంచ్, దాసరి భాస్కర్ ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో మరిన్ని వృత్తి శిక్షణ కార్యక్రమాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గ్రామాల్లో మహిళలకు జన శిక్షణ సంస్థాన్ ద్వారా మరిన్ని వృత్తి శిక్షణ కార్యక్రమాలు అందించి, వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలని డీఈఓ ప్రణీత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలోని జనశిక్షణ సంస్థ కార్యాలయంల ఆవరణలో బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో శిక్షణలు నడిచే వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి పద్మభూషణ్ రాజు మాట్లాడుతూ జనశిక్షణ సంస్థలో నేర్చుకున్న అభ్యర్థులకు జిల్లా పరిశ్రమ కార్యాలయం, బ్యాంకుల ద్వారా రుణం తీసుకునే సదుపాయం ఉంటుందని శిక్షణ పూర్తి చేసుకొని సర్టిఫికెట్ పొందిన వారు నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం.శ్యామల, బ్యాంకు మేనేజర్ ప్రసాద్, జన శిక్షణ సంస్థ చైర్మెన్ పెండేకర్ రమేష్, ఐటిఐ ప్రిన్సిపల్ సుజాత, సెడ్స్ డైరెక్టర్ ఆర్.సురేందర్, గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బిక్కు నాయక్, జన శిక్షణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్న, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ సంతోష్, రాజు, శంకర్ బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

పోచమ్మ, మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో గత మూడు రోజులుగా పోచమ్మ, మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. శివశ్రీ గొంగల్ల ప్రవీణ్ కుమార్ వేద పండితుల మంత్రోచ్చరణలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. ఉదయం వేద మంత్రాలతో విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు సన్మానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మండల అధ్యక్షుడు మల్లేష్, గ్రామస్తులు బాలాజీ, అశోక్, గంగాధర్, పెంటన్న, స్వామి, రవి, రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.